

కథా కౌముది

# అనగనగా ఓ రాజకుమారి బోడపాటి రమేష్

ఊహాదేశపు మహారాజు అప్పుడే సభ చాలించి అంత:పురం చేరుకుంటున్నాడు. ఆయన వెంట మహామంత్రి కూడా ఉన్నాడు.

"ప్రభువులు ఎందుకనో ఆందోళన చెందుతున్నట్లున్నారు."

"............"

"మన రాజ్యానికి ఏదయినా ఆపద సంభవిస్తోందా? శత్రు రాజులెవరైనా మన మీద దాడి చేస్తున్నట్లు వేగులు వార్త తెచ్చారా? మీ బాధకు కారణం చెప్పండి ప్రభూ." మంత్రి ముఖంలో ఆందోళన.

"ఏం లేదు మహా మంత్రీ.. మీ దేశభక్తి, శక్తిసామర్ధ్యాలవల్ల భగవంతుని ఆశీస్సులతో మన ప్రజలు సుఖంగానే ఉన్నారు. శత్రు రాజుల వల్ల ఆపద కూడా లేదు. కానీ..."

"చెప్పటానికి సందేహిస్తున్నారేం ? అది నేను వినకూడని విషయమా ప్రభూ?" అన్నాడు ఆతృతగా.

"అదేంకాదు. అంత:పురం లోని విషయాలే కలవరపెడుతున్నాయి అమాత్యా. ముఖ్యంగా మా చిన్నారి యువరాణి ఊహా కుమారి విషయం లోనే మేము ఆందోళన చెందుతున్నాము".

"యువరాణి వారు ఏమయినా అనారోగ్యానికి గురయినారా ప్రభూ?"

"శారీరక అనారోగ్యం లేదు కానీ మానసికంగా చాలా బాధ పడుతున్నట్లు తోస్తున్నది. చెలికత్తెలతో ఆడి పాడదు. ఏదో ఊహాలోకం లో విహరిస్తున్నట్లు తోస్తున్నది."

"యుక్త వయసు వచ్చినది కదా ఆమె వివాహ విషయమై ప్రభువులవారు ఆలోచించాలి. ఏ రాకుమారునైనా వరించెనేమో? లేదంటే స్వయంవరం ఏర్పాట్లు చేయమందురా ?"

"ఇప్పట్లో వివాహ ప్రయత్నాలు ప్రారంభించటం ప్రమాదకరం. అందరు రాకుమారులు ఆమెను కాంక్షింతురు. ఎవరికి కోపము కలిగిననూ యుద్ధములు తప్పవు."

"అట్లయిన నృత్య సంగీతములతో ఆమెకు కాలక్షేపము కలిగించవచ్చునేమో?"

"అదియూ విఫలమయినది. మా చిన్నారికి సంగీతమన్న ఆసక్తి లేదు. ఆమె గొంతెత్తి పాడిన అంత:పురవాసులందరూ వ్యాధిగ్రస్తులగుదురు. చిన్నతనం నుండి రాచరికం లో పెరిగినదేమో నృత్యం ఆమెకు అలవి అగుటలేదు. పైగా ఆమె శరీర శ్రమకు ఓర్చుకొనలేదు. గ్రంధపఠనం మీద మక్కువ ఉన్నట్లుగా మహారాణీ వారు గ్రహించి మాకు మనవిచేసుకున్నారు."అన్నాడు మహారాజు ఒకింత దర్పంగా.

"అయినచో ఇంకేమీ మనవద్ద పురాణ గ్రంధములు, పతివ్రతల కధలు, వ్రతకధలూ ఉన్నవి కదా. వాటి శ్రవణమునకు ఏర్పాట్లు చేయమందురా?"

"వాటి మీద మాపట్టికి అయిష్టత. అవి అన్నియూ పాతకాలపు భావములనియూ అనాదిగా స్త్రీని అణగ దొక్కుటకు ఆమె వ్యక్తి స్వాతంత్రం హరించుటకు పురుషులు కల్పించిన కట్టుకధలని ఆమె అభిప్రాయం".

"హరిహరి. ఇదేమి విపరీతం ప్రభూ. అనాదిగా ఆదర్శప్రాయములైన రామాయణ భారతాది పురాణ గ్రంధములను ఈసడించటమా! మన రాకుమారివి విపరీత భావములుగా తోచుచున్నవి.మానసిక చికిత్స అవసరమేమో, రాజవైద్యులను పిలిపించమందురా?".

"వద్దు మహామంత్రీ మా చిన్నారిని మానసిక వైద్యమునకు గురిచేయటం మాకు ఇష్టంలేదు."

"మరి"

"మన రాజ్యంలో గ్రంధములు రచింప గలవారికోసం దండోరా వేయించండి. పద్య కవిత్వమన్న మా చిన్నారికి గిట్టదు. వచన కవిత్వమే కావలెను. ఉదయమునుండి రాకుమారి రాత్రి శయనించువరకూ ఆమెకు గ్రంధ పఠనం కావించవలెను. స్త్రీలకు ప్రాధాన్యం. తను మెచ్చిన రచన చేసినవారికి తగిన సత్కారం అని ప్రకటించండి."

"మన ఆస్థాన కవులున్నారు కదా."

"వారు మగవారు. వారి రచనలు మా రాకుమారికి రుచించవు."

"మరి ప్రతిదినమూ బహుమతి సత్కారములు జరపవలెనన్న మన ఆర్ధిక పరిస్థితి క్షీణించునేమో."

"ఇక మీరు వెళ్ళవచ్చు".

"చిత్తం ప్రభూ".

★ ★ ★

రాజ్యమంతటా స్త్రీల నుండి రచనలు రాకుమారి కొరకు రావలెనని దండోరా వేయబడింది. బహుమతులు కూడా ప్రకటించటంతో ఆమె అనుగ్రహానికి పోటీ పడేవాళ్ళు రోజు రోజుకి ఎక్కువవుతున్నారు. వీరినందరినీ అంత:పురం తీసుకువెళ్ళటం రాజోద్యోగులకు తలకు మించిన భారంగా తయారయింది. .

"ఇందులో నువ్వు చెప్పదలచుకున్న భావమేమి ?" ఆ రచయిత్రిని ప్రశ్నించింది, అప్పుడే విన్న రచన గురించి.

"ఏం లేదు రాకుమారీ, స్త్రీలకు అన్ని సమయములందునూ పురుషుని రక్షణ కావలెనని, అది లేనిచో ఆమె అగచాట్లు పడునని. "వణుకుతూనే చెప్పింది.

"అంటే స్త్రీ పురుషునకు బానిసగా ఉండటం తప్పదనే కదా." రాకుమారి గద్దించింది.

"....... " ..

"ఈ రచనలో పురుష ప్రమేయం కనిపించుచున్నది. నిజం చెప్పు. "

"మన్నించండి. నేను నా పిల్లల బాగోగులు చూస్తుంటే మీ బహుమతికి ఆశ పడి నా భర్త చేసిన ప్రయత్నం."

"చూచితిరా మగవాని దౌర్జన్యం. కేవలం బహుమతికి ఆశపడి ఈమెను తన పిల్లలకు దాసిగా నియోగించి ఆమె స్వతంత్ర భావములను అణగదొక్కుచూ తన భావములను అమె పేరు మీద ప్రచారం చేయ బూనుకున్న కుత్సితుడు. ఎవరక్కడ.?" వచ్చిన భటులతో" ఈమె భర్తను ఆరు మాసములు కారాగారం లో బంధించమని మా తండ్రి గారికి చెప్పండి.అతడు తిరిగివచ్చువరకూ కుటుంబ పోషణకు ఏర్పాట్లు చేయండి".

★ ★ ★

రోజులు గడుస్తున్నాయి, రాజ్యానికి భారంగా.

రాజు, మంత్రి మళ్ళీ భేటీ.

"విచారంగా ఉన్నారేం ప్రభూ."

"ఏముంది. ఇదివరలో మా చిన్నారి ముచ్చట తీర్చటానికి రచనలను ప్రోత్సహించాను. అదే నా అశాంతికి కారణమయింది."

"నిజమే ప్రభూ. మన రాజ్యపు ఆర్ధికస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది.".

"అందరి రచనలు విన్న మా రాకుమారికి తను కూడా రచనలు చేయాలనే ఆసక్తి మొదలయింది. రచనలు చదివి వినిపించటం పాత పద్ధతి. నటీనటులతో నిరంతర ధారావాహికలు నిర్మించి దృశ్య ,శ్రవణ పరికరాలతో ప్రజలు తమ ఇంటి వద్దే వీక్షించే ఏర్పాట్లు చేయించమని కోరింది. రాజ్యమంతా అటువంటి పరికరాలు అందచేయండి."

మంత్రికి మతి పోయినట్లనిపించి "అవి మన రాజ్యం లో తయారవవ్వు ప్రభూ." అన్నాడు అయోమయంగా.

"ఏ రాజ్యం లో తయారయితే అక్కడినుంచి తెప్పించండి."

"మన ఆర్ధిక పరిస్థితి."

"నాణాలు ముద్రించండి. లేకపోతే ప్రజలమీద పన్నులు ఎక్కువ వేయండి. మా చిన్నారి ఆనందమే మా ఆనందం,. ప్రజల ఆనందం కావాలి. మా చిన్నారే ప్రజ. తక్షణం అమలు చేయండి".

'చిత్తం మహారాజా 'అనే మాట వినిపించక పోవటంతో ఆశ్చర్యంగా చూసిన రాజుకు చిత్తరువులా నిలబడ్డ మంత్రి కనిపించాడు.

----------★---------------

Click here to share your comments on this story